# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 23-01-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

### ముఖ్యాంశాలు

- ఎం.ఎస్.ఎం.ఈ లకు విరివిగా రుణాలు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బ్యాంకర్లను కోరారు.
- వెలిగొండ ప్రాజెక్ట్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు.
- స్వాతంత్ర సంగ్రామంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ చూపించిన ధైర్య సాహసాలు నేటి తరానికి స్ఫూర్తి దాయకమని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు.
- రేపు ప్రారంభం కానున్న విశాఖ ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు.
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 130వ సంచిక ఈ ఆదివారం ప్రసారమవుతుంది.

====================

రాష్ట్రంలో ఎవ్వరూ ప్రయివేట్ వ్యక్తుల వద్ద రుణాలు తీసుకునే పరిస్థితి ఉండకూడదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. రాష్ట్ర సచివాలయంలో జరిగిన 233, 234వ ఎస్ఎల్బీసీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. వ్యవసాయం సహా ఏ అవసరం వచ్చినా బ్యాంకుల వద్దకు వెళ్లి రుణాలు తీసుకునే పరిస్థితి ఉండేలా బ్యాంకర్లు సహకరించాలన్నారు. పునరుత్పాదక ఇంధన రంగానికి, ఎం ఎస్ ఎం ఈ లకు, ప్రకృతి సేద్యం విస్తరణకు బ్యాంకర్లు విరివిగా రుణాలు ఇవ్వాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పెద్ద ఎత్తున రుణాలు ఇవ్వాలని, అప్పుడే అన్ని రంగాల్లో ఆయా వర్గాల వారు అభివృద్ధి చెందుతారని చెప్పారు. డ్వాక్రా గ్రూపు బ్యాంక్ ఖాతాలపై 15 రకాల ఛార్జీలు వేస్తున్నారన్న ఆయన ఈ ఛార్జీలను తగ్గించాలని బ్యాంకర్లను కోరారు. రాజధాని అమరావతిని ఫైనాన్స్ సంస్థలకు కేంద్రంగా చేయాలని భావిస్తున్నామని, బ్యాంకులతో సహా వివిధ ఆర్థిక రంగ సంస్థలు కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నాయని ముఖ్యమంత్రి తెలియజేశారు.

====================

వెలిగొండ ప్రాజెక్ట్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. వెలిగొండ ప్రాజెక్ట్ ను, ఫీడర్ కాలువ పనులను ఆయన ఈరోజు పరిశీలించి, అధికారులు, నిర్మాణ ఏజెన్సీ ప్రతినిధులతో పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, నల్లమల సాగర్ రిజర్వాయర్ ను ఈ ఏడాది సీజన్ మొదలయ్యేలోపు నింపే లక్ష్యంతో పనులను వేగవంతం చేశామన్నారు. ఎన్డియే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత 18 నెలల్లోనే 6 వేల 579 మీటర్ల బెంచింగ్ పనులు, 3 వేల 644 మీటర్ల లైనింగ్ పూర్తి చేశామని చెప్పారు. ఇటీవల నిర్వాసితులకు 90 కోట్ల రూపాయల మేర పరిహారం విడుదల చేశామని, నిర్వాసితులకు నష్ట పరిహారం అందించిన తరువాతే, వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని మంత్రి రామానాయుడు స్పష్టం చేస్తూ...

(వాయిస్…29 సెకన్లు)

====================

స్వాతంత్ర సంగ్రామంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ చూపించిన ధైర్య సాహసాలు నేటి తరానికి స్ఫూర్తి దాయకమని రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా మంత్రి.. డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలో నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ.. నేతాజీ దేశ స్వాతంత్యం కోసం తన జీవితాన్నే అంకితం చేసిన మహానాయకుడని కీర్తించారు. నాకు రక్తం ఇవ్వండి, నేను మీకు స్వాతంత్యం ఇస్తాను అనే నినాదంతో కోట్లాది మంది భారతీయుల్లో దేశభక్తి జ్వాలలు రగిలించారని, ఆయన త్యాగం, ధైర్యం, దేశభక్తి నేటి తరానికి మార్గదర్శకమని మంత్రి పేర్కొన్నారు.

====================

విశాఖ ఉత్సవ్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం. ఎన్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. రేపటి నుండి ఫిబ్రవరి 1వ తేదీ వరకు జరగనున్న విశాఖ ఉత్సవ్ సన్నాహక సమీక్షా సమావేశంలో ఉత్సవాల నిర్వహణ, భద్రత, ట్రాఫిక్, పార్కింగ్, పారిశుద్ధ్యం, విద్యుత్, అగ్నిమాపక, వైద్య సేవలపై కలెక్టర్ సమగ్రంగా సమీక్షించారు. ఆర్‌కే బీచ్ ప్రధాన వేదికగా నిర్వహించే కార్నివల్, సాంస్కృతిక కార్యక్రమాలు, డ్రోన్ షో, లైవ్ కాన్సర్ట్‌లు, స్థానిక కళాకారుల ప్రదర్శనలు ప్రజలను ఆకట్టుకునేలా ఉండాలన్నారు.

====================

విరామం

====================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 130వ సంచిక ఈనెల 25వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.

====================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2015లో Pro-Active Governance and Timely Implementation ప్రగతి పేరిట నిర్మాణాత్మకమైన సమీక్షా కార్యక్రమాన్ని ప్రారంభించారు. దేశంలోని కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో జాప్యానికి కారణమయ్యే సమస్యలపై ఈ ప్రగతి వేదిక దృష్టి సారించడంతో ఆయా ప్రాజెక్టులు వేగవంతమయ్యాయి. అందులో భాగంగా పౌరవిమానయాన మంత్రిత్వ శాఖకు చెందిన 38 కీలక విమానశ్రయాలు కూడా ప్రగతి కింద సమీక్షించబడ్డాయి. వాటి పురోగతి గురించి ఇప్పుడు తెలుసుకుందాం!
ప్రగతి నేతృత్వంలోని ప్రాజెక్ట్ మానిటరింగ్ గ్రూప్ (PMG) పోర్టల్‌లో మొత్తం సుమారు 90 వేల 978 కోట్ల రూపాయల పెట్టుబడి కలిగిన 38 ప్రాజెక్టులను ప్రస్తుతం పర్యవేక్షిస్తున్నారు. ఈ 38 ప్రాజెక్టులలో మొత్తం 21 వేల 694 కోట్ల రూపాయల పెట్టుబడితో కూడిన 3 ప్రాజెక్టులను ప్రధానమంత్రి గతంలో ప్రగతి కింద సమీక్షించారు. తరువాత ఆ ప్రాజెక్టులు పూర్తయ్యి ప్రారంభించబడ్డాయి. పౌర విమానయాన మంత్రిత్వ శాఖకు చెందిన 19 ప్రాజెక్టులలో PMG పోర్టల్‌లో మొత్తం 53 సమస్యలు ఉత్పన్నం కాగా.. అందులో 51 సమస్యలు పరిష్కరించబడ్డాయి. మిగిలిన 2 సమస్యలను ప్రగతి యంత్రాంగం పర్యవేక్షిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణం కూడా ప్రగతి సమీక్షల అనంతరం వేగవంతమయ్యింది.

====================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గోదావరి పుష్కరాల నిర్వాహణపై సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. సీఎస్ విజయానంద్ రెడ్డి, మంత్రులు రామనారాయణరెడ్డి, వంగలపూడి అనిత, పి.నారాయణ, నిమ్మల రామానాయుడు, వాసంశెట్టి సుభాష్, కందుల దుర్గేష్, బీసీ జనార్ధన్ రెడ్డి, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా 2027 సంవత్సరం జూన్ 26 నుండి, జూలై 7 వరకు పుష్కరాలు నిర్వహించాలని నిర్ణయించారు. గోదావరి ప్రవహించే పోలవరం, ఏలూరు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, అంబేద్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల్లో పుష్కరాల నిర్వహణకు ఏర్పాట్లు చేయనున్నారు. ప్రస్తుతం ఉన్న 234 ఘాట్లతో పాటు... కొత్తగా 139 ఘాట్లతో పాటు మొత్తం 373 ఘాట్లు 9 వేల 918 మీటర్ల పొడవున అభివృద్ధి చేసేలా ప్రణాళికలకు రూపకల్పన చేయాలని నిర్ణయించారు.

====================

భద్రతా నియమాలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నియంత్రించవచ్చని బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ అన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలలో భాగంగా బాపట్లలో రవాణా, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల అవగాహన ర్యాలీని బాపట్ల ఎమ్మెల్యే వేగేశ్న నరేంద్ర వర్మరాజుతో కలిసి ఈరోజు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. రహదారి భద్రతపై ప్రజల్లో అవగాహన పెరగాల్సి ఉందన్నారు.

====================

====================